# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

VC NEWS

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ శనివారం 12 ఏప్రిల్ 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 261

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD





# భగ్గుమన్న బంగారం ధరలు

మేలిమి బంగారం రూ.96,450కు చేరిక



బాపూఘాట్‌లో గాంధీ సరోవర్ నిర్మాణం
మీరాలం ట్యాంక్‌పై బ్రిడ్జి నిర్మాణ పనులు
అధికారులతో సమీక్షించిన సీఎం రేవంత్

# మూసీ రివర్ ఫ్రంట్ పనుల్లో వేగం పెంచండి

**ఫ్యూచర్ సిటీ వరకు మెట్రో విస్తరణ**

**ఇందుకు అనుగుణంగా డిపిఆర్ సిద్ధం చేయాలి**

**అధికారులతో సమీక్షలో సిఎం రేవంత్ ఆదేశం**

**హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెట్రో రెండో దశ విస్తరణకు సంబంధించిన ప్రతిపాదనల పురోగతిని ముఖ్యమంత్రి ఆరా తీశారు.**

హైదరాబాద్,ఏప్రిల్11(ఆర్ఎన్ఎ): మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. బాపూఘాట్లో నిర్మించ తలపెట్టిన గాంధీ సరోవర్‌తో పాటు మీర్ ఆలం ట్యాంక్ పై నిర్మించనున్న బ్రిడ్జి నమూనాలను సీఎం పరిశీలించారు. మీర్ ఆలం ట్యాంక్‌పై బ్రిడ్జి నిర్మాణ పనులకు జూన్‌లో టెండర్లు పిలవాలని ముఖ్యమంత్రి అన్నారు. ఈలోగా అందుకు అవసరమైన సర్వేలు, నివేదికలు, ప్రతిపాదనలు, డిజైన్లతో డీపీఆర్ను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు.

శుక్రవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మూసీ పునరుజ్జీవనంపై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, శ్రీనివాసరాజు, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్తో పాటు– మూసీ రివర్ డెవలప్మెంట్ కార్పోరేషన్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మీర్ ఆలం ట్యాంక్ పై నిర్మించే బ్రిడ్జికి సంబంధించి కన్సెల్టెన్సీలు తయారు చేసిన నమూనా డిజైన్లను అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ప్రదర్శించారు. రెండున్నర కిలోమీటర్ల పొడవైన ఈ బ్రిడ్జిని అద్భుతంగా నిర్మించాలని, అదే సమయంలో సందర్శకులు, ప్రయాణికుల రక్షణకు అత్యంత ప్రాధాన్యముండే డిజైన్లను ఎంచుకోవాలని సీఎం అధికారులను అప్రమత్తం చేశారు. ఈ బ్రిడ్జితో పాటు మీర్ ఆలం ట్యాంక్‌లో వివిధ చోట్ల ఐలాండ్లా ఉన్న మూడు ప్రాంతాలను పర్యాటకులను ఆకట్టుకునేలా అందంగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు.

పూలే జయంతి సందర్భంగా నివాళులు






# తెలంగాణ తెచ్చుకుందే ఉగ్యోగాల కోసం

**వరంగల్‌లో మెగా జాబ్ మేళా**

**ప్రారంభించిన మంత్రులు**

**త్వరలో అంగన్‌వాడీ ఉద్యోగాల నోటిఫికేషన్**

**వెల్లడించిన మంత్రి సీతక్క**

## టెట్ షెడ్యూల్ విడుదల

**జూన్ 15 నుంచి 30 వరకు టెట్ పరీక్షలు**



హైదరాబాద్: తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష షెడ్యూల్ విడుదలైంది. జూన్ 15 నుంచి 30 వరకు టెట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ వెల్లడించింది. ఈ పరీక్షకు సంబంధించిన పూర్తి వివరాలు ఏప్రిల్ 15 నుంచి అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపింది. తెలంగాణలో ఏడాదిలో రెండుసార్లు టెట్ పరీక్ష నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయాన్ని గతేడాది జులైలో ప్రకటించింది. ఇందులో భాగంగా గతేడాది డిసెంబర్‌లో టెట్ నోటిఫికేషన్ ఇచ్చిన ప్రభుత్వం.. ఈ ఏడాది జనవరిలో పరీక్షలు నిర్వహించింది. జనవరిలో జరిగిన ఉపాధ్యాయ అర్హత పరీక్షకు 2.75లక్షల మంది దరఖాస్తు చేసుకోగా.. దాదాపు 2లక్షల మందికి పైగా హాజరయ్యారు.

# అభివృద్ధి..వారసత్వం లక్ష్యంగా పయనం




**2036 ఒలంపిక్స్ కోసం భారత్ ప్రయత్నం**

**విపక్షాలది కుటుంబ రాజకీయం**

**వారికి అభివృద్ధి కన్నా స్వప్రయోజనాలే ముఖ్యం**

**వారణాసిలో పలు అభివృద్ధి పనులకు మోడీ శ్రీకారం**

**ఇటీవలి అత్యాచార ఘటనపై అధికారులతో ఆరా**

ప్రతిపక్షాలు 'పరివార్ కా సాథ్ పరివార్ కా వికాస్' అనే విధానాన్ని అనుసరిస్తాయని ప్రధాని పేర్కొన్నారు. కానీ దానికి విరుద్ధంగా తామెప్పుడూ 'సబ్‌కా సాథ్..సబ్‌కా వికాస్' నినాదంతో ముందుకువెళ్తామన్నారు.

# పదేళ్లలో మీరు అప్పులు తేలేదా?



మెదక్:'భారాస అధికారంలో ఉన్న పదేళ్లలో ఎక్కడా భూమి తాకట్టు పెట్టి డబ్బు తెచ్చుకోలేదా? కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ పథకమని రుణాలు తీసుకోలేదా?' అని మెదక్ భాజపా ఎంపీ రఘునందన్‌రావు ప్రశ్నించారు. ఇవన్నీ మర్చిపోయి రూ.10వేల కోట్ల రుణం ఇచ్చారని, దీని వెనకాల కాంగ్రెస్, భాజపాకు ఏదో సంబంధం ఉందని మాట్లాడటం సరికాదన్నారు. శుక్రవారం మెదక్‌లో నిర్వహించిన ఎమ్మెల్సీల ఆత్మీయ అభినందన సభలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న పదేళ్లలో ఒక్క రూపాయి అప్పు తేలేదా? కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం అప్పుడు మీకు సపోర్టు చేయలేదా? అని ప్రశ్నించారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పదేళ్లలో రూ.4.5లక్షల కోట్లు తెచ్చామని అధికారికంగా అసెంబ్లీలో అప్పటి ఆర్థిక మంత్రి హరీశ్‌రావు మాట్లాడారని పేర్కొన్నారు. అప్పుడు ఏ భాజపా ఎంపీ మీకు అండగా ఉన్నారన్నారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అందరూ బాగుండాలని కోరుకునే నాయకుడు నరేంద్ర మోదీ అని చెప్పారు. ఏ రాష్ట్రానికైనా అవసరం ఉంటే అప్పటి పరిస్థితులు బట్టి రుణాలిస్తారని పేర్కొన్నారు. రుణాలు ఇస్తే దాని వెనకాల ఏదో ఉందని, భాజపా, కాంగ్రెస్ కలిశాయని ఇంత దారుణంగా మాట్లాడడం.. పదేళ్లు మంత్రిగా పనిచేసిన కేటీఆర్‌కు తగదన్నారు. భాగ్యనగరంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు భారాస ఎవరి కోసం పోటీ చేయడం మానుకుందని ప్రశ్నించారు. ఎంఐఎంతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకొని సూట్‌కేసులు తీసుకున్నారని ఆరోపించారు. భాజపాను ప్రశ్నించే నైతిక హక్కు కేటీఆర్‌కు లేదన్నారు.

**అప్పుడు మీకు ఏ ఎంపీ అండగా ఉన్నారు భారాసకు ఎంపీ రఘునందన్‌రావు ప్రశ్న**

**'భారాస అధికారంలో ఉన్న పదేళ్లలో ఎక్కడా భూమి తాకట్టు పెట్టి డబ్బు తెచ్చుకోలేదా? కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ పథకమని రుణాలు తీసుకోలేదా?' అని మెదక్ భాజపా ఎంపీ రఘునందన్‌రావు ప్రశ్నించారు.**

# పదేళ్లలో తెలంగాణను లూటీ చేసిన కెసిఆర్ కుటుంబం

**ఫార్ములా రేస్ కేసులో కెటిఆర్ అరెస్ట్ కాక తప్పదు**

**కెసిఆర్ కుటుంబ దోపిడీపై సిబిఐ విచారణ జరపాలి**

**పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్**




# రజతోత్సవ సభకు అనుమతి నిరాకరణపై హైకోర్టుకు భారాస.. విచారణ వాయిదా

హైదరాబాద్: ఎల్కతుర్తిలో భారాస రజతోత్సవ సభకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో ఆ పార్టీ హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం ఈ నెల 17కి వాయిదా వేసింది. సభకు అనుమతిచ్చేలా పోలీసులను ఆదేశించాలంటూ భారాస నేతలు పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ నెల 27న ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకల సందర్భంగా దీన్ని ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. హోంశాఖ ముఖ్య కార్యదర్శి, వరంగల్ సీపీ, కాజీపేట ఏసీపీని భారాస ప్రతివాదులుగా చేర్చింది. దీంతో ప్రతివాదులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయడానికి హోంశాఖ తరఫు న్యాయవాది సమయం కోరారు. ఈ నెల 21 వరకు గడువు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సభకు ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంటుంది కదా అని హైకోర్టు ప్రశ్నించింది. ఈ నెల 17 నాటికి కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది



# కాంగ్రెస్ ప్రభుత్వంలో భారీ కుంభకోణాలు



**ఆర్థిక నేరానికి తెరలేపిన రేవంత్ ప్రభుత్వం**

**400 ఎకరాలు పక్కాగా అటవీ భూములే**

**దానిపై రుణాలు ఎలా తెచ్చరో చెప్పాలి**

**దీనిపై సిబిఐ విచారణ జరగాల్సిందే**

**బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ డిమాండ్**

2లో..

## మాతృభాషకు విద్యార్థులను దూరం చేయొద్దు

హైదరాబాద్:తెలంగాణలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ద్వితీయ భాషగా సంస్కృతం అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు వచ్చిన వార్తలు విని విచారించానని మాజీ
ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. మార్కుల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకుంటే మాత్రం పునరాలోచన చేయాలని కోరారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు.
విద్యార్థులను మన మాతృభాషకు దూరం చేయడం మంచిది కాదు. సంస్కృతాన్ని బోధించడంలో తప్పు లేదు.. అదే సమయంలో మనదైన సంస్కృతిని అందిపుచ్చుకునే దిశగా అమ్మ భాష ఆలంబనగా నిలుస్తుంది. అందుకే జాతీయ విద్యావిధానం - 2020 సైతం దానికి ప్రాధాన్యత ఇచ్చింది. ఈ స్ఫూర్తిని అందిపుచ్చుకుని, విద్యార్థులను మాతృభాషకు మరింత చేరువ చేసే దిశగా తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆకాంక్షిస్తున్నానని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

## నేడు ఎపి ఇంటర్ ఫలితాల ప్రకటన

అమరావతి: ఏపీలో శనివారం ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలు విడుదల కానున్నాయి. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. శనివారం ఉదయం 11 గంటలకు ఇంటర్మీడియట్ రెండు సంవత్సరాల పరీక్షల ఫలితాలు విడుదల చేస్తామన్నారు. విద్యార్థుల తమ ఫలితాలను ఆన్‌లైన్‌లో చూసుకోవచ్చునని తెలిపారు. మన మిత్ర వాట్స్ యాప్ నంబర్‌కు 9552300009లో కూడా ఫలితాలు తెలుసుకోవచ్చునని చెప్పారు. అందరికి మంచి ఫలితాలు రావాలని కోరుకుంటూ మంత్రి నారా లోకేష్ శుభాకాంక్షలు చెప్పారు. కాగా ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు మార్చి1న ప్రారంభం అయ్యాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు.మార్చి 20వ తేదీ వరకు పరీక్షలు జరిగాయి. ఇప్పటికే ఇంటర్ పరీక్షల మూల్యాంకనం వేగంగా కొనసాంది. ఏప్రిల్ 6 నాటికి మూల్యాంకనం పూర్తి చేశారు. ఆ తర్వాత ఫలితాలను కంప్యూటరీకరణ చేసేందుకు 5-6 రోజుల సమయం పట్టింది. తొలిరోజు మొదటి సంవత్సరం విద్యార్థులకు ద్వితీయ భాషపై పరీక్ష నిర్వహించారు. ఇంటర్మీడియట్ రెండు సంవత్సరాల విద్యార్థులకు రోజు మార్చి రోజు పరీక్షలు జరిగాయి. ఈ క్రమంలో అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా 1,535 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. 10.58 లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమేరాలు ఏర్పాటు- చేసి ఆన్‌లైన్‌లో ఉన్నతాధికారుల కార్యాలయాలకు అనుసంధానం చేశారు. పరీక్షా కేంద్రాలను 'నో మొబైల్ జోన్'గా ప్రకటించారు. ఈ సంవత్సరం -టె-న్త్, ఇంటర్ హాల్‌టికెట్లు- విడుదల చేసినట్టుగానే వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఫలితాలు కూడా విడుదల చేసేందుకు సన్నాహాలు చేశారు. అధికారిక వెబ్‌సైట్ ద్వారా విద్యార్థులు తమ ఫలితాలను చూసుకోవచ్చు. ఇకపోతే తెలంగాణలో ఇంటర్ పరీక్షలు మార్చి 5న మొదలై 25వ తేదీతో ముగిసాయి. ప్రస్తుతం మూల్యాంకన పక్రియ వేగంగా కొనసాగుతోంది. ఏప్రిల్ చివరి వారంలో ఫలితాలు విడుదల చేయనున్నట్లు- తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యా మండలి అధికారిక వర్గాల సమాచారం.

## పదేళ్లలో తెలంగాణను లూటీ చేసిన కెసిఆర్ కుటుంబం

**హైదరాబాద్:** ఫార్ములా ఈ రేసు కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఏదో ఒక రోజు అరెస్ట్ కాక తప్పదని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్ గాంధీ భవన్‌లో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విలేకర్లతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ దోపిడీని భరించ లేకనే కాంగ్రెస్ పార్టీని తెలంగాణ ప్రజలు గెలిపించారన్నారు. గత పదేండ్లలో జరిగిన భూ దోపిడీపై విచారణ జరపాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తానని ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కేసీఆర్ కుటుంబంపై సీబీఐతో విచారణ జరపాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. హెచ్‌సీయూ అంశానికి కేటీఆర్ అరెస్ట్‌కు లింక్ పెట్టడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. కేటీఆర్ మాట్లాడే మాటలకు చిన్న పిల్లలు సైతం నవ్వుకుంటున్నారన్నారు. పదేండ్లలో భూ దోపిడి చర్చకు సిద్ధమా?.. దమ్ము ధైర్యముంటే చర్చకు రండంటూ కేటీఆర్‌కు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఈ సందర్భంగా సవాల్ విసిరారు. కరప్షన్‌కి కేరాఫ్ అడ్రస్ కేసీఆర్ కుటుంబమని ఆయన అభివర్ణించారు. లిక్కర్ స్కాం చేసింది కూడా కేసీఆర్ కుటుంబమేనని ఆయన గుర్తు చేశారు. అడ్డమైన వాళ్లు వచ్చి మాట్లాడుతున్నారని.. ఈ మాటలను నమ్మకండంటూ తెలంగాణ ప్రజలకు పీసీసీ చీఫ్ సూచించారు. కేటీఆర్ ఇంతగా దిగజారుతాడా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. చాలా తక్కువ సమయంలో అత్యంత ఎక్కువ ధనం దోపిడి చేసింది కేసీఆర్ కుటుంబమేనని ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ గుర్తు చేశారు. బిల్లీ రావుతో కేటీఆర్ ఒప్పందం చేసుకున్నాడని పేర్కొన్నారు. కేటీఆర్ గుంటూరులో ఏం చదువు నేర్చుకున్నాడో అర్థం కావడం లేదన్నారు. సగం సగం తెలుసుకొని రాజకీయ లబ్ది కోసం కేటీఆర్ మాట్లాడుతారంటూ ఎద్దేవా చేశారు. బీసీ కుల గణన వల్ల బీఆర్ఎస్ పార్టీలో వణుకు పుట్టిందన్నారు. బీఆర్ఎస్ పదేండ్లలో ఎన్నివేల ఎకరాలను కొల్లగొట్టారో తెలియదా? అంటూ ఆ పార్టీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు.రైతులు బాగు పడుతుంటే
కేటీఆర్‌కి కడుపు నొప్పి వస్తోందని ఎద్దేవా చేశారు. ఏఐ టెక్నాలజీతో వీడియోలు చేయించి తప్పుడు సంకేతాలు ప్రజల్లోకి పంపారంటూ బీఆర్ఎస్ నేతలపై నిప్పులు చెరిగారు. తెలంగాణకి ఉద్యోగాలు రాకూడదా? అంటూ బీఆర్ఎస్ నేతలు సూటిగా ప్రశ్నించారు.

## తెలంగాణ తెచ్చుకుందే ఉగ్యోగాల కోసం

వరంగల్: తెలంగాణ తెచ్చుకుంది ఉద్యోగాల కోసమేనని మంత్రి సీతక్క తెలిపారు. వరంగల్ ఎంకే నాయుడు కన్వెన్షన్‌లో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహించగా, మంత్రులు సీతక్క, కొండా సురేఖ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడారు. మెగా జాబ్‌మేళాకు భారీ స్పందన వచ్చిందని అన్నారు. భారీ సంఖ్యలో నిరుద్యోగులు తరలివచ్చారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత 60వేల ఉద్యోగాలు ఇచ్చిందని గుర్తుచేశారు. త్వరలో అంగన్‌వాడీ ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేస్తామని తెలిపారు. ఇలాంటి జాబ్‌మేళాను నిరుద్యోగులు ఉపయోగించుకోవాలని సూచించారు. అవకాశాలు వస్తే వాటిని వదులుకోవద్దని అన్నారు. తల్లిదండ్రులకు భరోసా కల్పించాలని చెప్పారు. సొంత ఊరు దాటితేనే.. భవిష్యత్తు బంగారం అవుతుందని మంత్రి సీతక్క తెలిపారు.60 కంపెనీల ద్వారా 11వేల ఉద్యోగాలు కల్పిస్తున్నామని మంత్రి కొండా సురేఖ తెలిపారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఎన్నికల ముందు తాము చెప్పామని.. అందులో భాగంగానే ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరంగల్‌పై ప్రత్యేక దృష్టి సాధించారని చెప్పారు. గత కేసీఆర్ ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యలపై పదేళ్లుగా నిర్లక్ష్యంగా వ్యవహారించిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే 60వేల ఉద్యోగాలు కల్పించామని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఉద్యోగం రావాలంటే కష్టం..
అందుకే ఇలాంటి జాబ్‌మేళాను నిర్వహించామని తెలిపారు. ప్రతిభ ఆధారంగానే ఉద్యోగం దక్కుతుందని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు.

# అభివృద్ధి..వారసత్వం లక్ష్యంగా పయనం



వారణాసి: భారత్ అభివృద్ధి, వారసత్వం అనే రెండింటితో ముందుకువెళ్తోందని ప్రధాని మోడీ అన్నారు. 2036లో నిర్వహించనున్న ఒలింపిక్స్‌కు భారత్ ఆతిథ్యం ఇవ్వాలని అనుకుంటుందని.. అందుకు అనుమతి తీసుకోవడానికి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. తన సొంత నియోజకవర్గమైన కాశీ ఎప్పటికీ తనదేనని.. తాను కాశీకి చెందినవాడినని మోదీ పేర్కొన్నారు.
శుక్రవారం ఆయన తన సొంత నియోజకవర్గం వారణాసిలో పర్యటించారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అలాగే ప్రధాని నరేంద్ర మోదీ మరోమారు ప్రతిపక్షాలపై విరుచుకు పడ్డారు. ప్రతిపక్ష పార్టీలు అధికార కాంక్షతో కుటుంబ ప్రయోజనాలపై మాత్రమే దృష్టి సారిస్తున్నాయని విమర్శించారు. కానీ తమ పార్టీ ఎటువంటి పదవీ కాంక్ష లేకుండా సమ్మిళిత అభివృద్ధి ఇతివృత్తంగా ముందుకుసాగుతోందని అన్నారు. ఎన్డీఏ కూటమి నేతలంతా ప్రతి ఒక్క పౌరుడి అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. ఫులే దంపతులను ఆదర్శంగా తీసుకొని తాము మహిళల విద్య, అభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. వారణాసిలో రూ.3,880 కోట్ల విలువైన 44 ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన ప్రధాని అక్కడి వారినుద్దేశించి ప్రసంగించారు. ప్రతిపక్షాలు 'పరివార్ కా సాథ్ పరివార్ కా వికాస్' అనే విధానాన్ని అనుసరిస్తాయని ప్రధాని పేర్కొన్నారు. కానీ దానికి విరుద్ధంగా తామెప్పుడూ 'సబ్‌కా సాథ్..సబ్‌కా వికాస్' నినాదంతో ముందుకువెళ్తామన్నారు. ప్రస్తుతం ప్రారంభించిన ప్రాజెక్టుల్లో కూడా గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేశామని అన్నారు. వాటిలో 130 తాగునీటి ప్రాజెక్టులు, నాలుగు గ్రామీణ రోడ్లు, 100 కొత్త అంగన్‌వాడీ కేంద్రాలు, 356 గ్రంథాలయాలు, పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉన్నాయని ప్రధాని తెలిపారు. గతంలో పూర్వాంచల్‌లో ఆరోగ్య సౌకర్యాలు తక్కువగా ఉండేవని, కానీ నేడు కాశీ పూర్వాంచల్‌కు ఆరోగ్య రాజధానిగా మారుతోందని ప్రధాని అన్నారు. 70 ఏళ్లు దాటిన ముగ్గురు లబ్ధిదారులకు ఆయుష్మాన్ కార్డులను అందజేశారు. ఇదిలావుంటే వారణాసిలో చోటుచేసుకున్న దారుణ సామూహిక అత్యాచార ఘటన దిగ్భ్రాంతికి గురిచేసింది. 6 రోజుల్లో 23 మంది వ్యక్తులు.. 19 ఏళ్ల యువతిపై అత్యాచారానికి పాల్పడిన అమానవీయ ఘటన ఇటీవల వెలుగుచూసిన సంగతి తెలిసిందే. ఇది ప్రధాని మోదీ దృష్టికి చేరడంతో ఆయన ఆరా తీశారు. శుక్రవారం వారణాసి కలెక్టర్, పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మోదీ వారణాసిలో పర్యటించిన సందర్భంగా ఇటీవల జరిగిన అత్యాచార ఘటన గురించి జిల్లా మేజిస్ట్రేట్, పోలీస్ కమిషనర్, డివిజినల్ కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. మార్చి 29వ తేదీన బాధిత యువతి కొంతమంది స్నేహితులతో కలిసి బయటకు వెళ్లింది. ఆమె తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో సామూహిక అత్యాచారం గురించి వెలుగులోకి వచ్చింది. పోలీసులకు ఆ యువతి వెల్లడించిన వివరాల ప్రకారం.. కొందరు యువకులు తనను పలు హోటళ్లకు, హుక్కా బార్లకు తిప్పుతూ అత్యాచారానికి పాల్పడ్డారని చెప్పింది. దర్యాప్తు జరిపిన పోలీసులు తొమ్మిది మందిని అరెస్టు చేశారు. కోర్టు వారిని జ్యుడీషియల్ కస్టడీకి పంపింది.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో భారీ కుంభకోణాలు




**హైదరాబాద్:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మోసం, విధ్వంసం, దృష్టి మళ్లించడం అనే 3డీ మంత్రంతో పాలన చేస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రేవంత్ ప్రభుత్వం ఆర్థిక నేరానికి తెరలేపిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో భారీ కుంభకోణాలు జరుగు తున్నాయని చెప్పారు. కంచ గచ్చిబౌలిలో జరిగిన పర్యావరణ విధ్వంసాన్ని చూసి దేశం మొత్తం విస్తుపోయిందన్నారు. ఆ 400 ఎకరాలు అటవీ భూమేనని, సుప్రీంకోర్టు తీర్పుల ఆధారంగా ఆ విషయాన్ని చెబుతున్నానని స్పష్టం చేశారు. హెచ్‌సీయూ భూముల వెనుక 10 వేల కోట్ల ఆర్థిక కుంభకోణం ఉందన్నారు. కుంభకోణానికి కర్త, కర్మ, క్రియ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంటూ ఆరోపించారు. మహాత్మా జ్యోతిబా ఫూలే జయంతి సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డికి అన్నీ తెలిసే భారీ ఆర్థిక నేరానికి పాల్పడ్డారని మండిపడ్డారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంతో దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తోందన్నారు. ఒక బీజేపీ ఎంపీ సహకారంతో ఈ స్కామ్ చేస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో ట్రస్ట్ ఎడ్వైజర్స్ ఇన్వెస్ట్మెంట్ అనే కంపెనీ రేవంత్ రెడ్డికి బ్రోకరిజం చేసిందన్నారు. అందుకు గాను .. సదరు
కంపెనీకి రూ.170 కోట్లు లంచం ఇచ్చారన్నారు. సుప్రీంకోర్టు తీర్పులు, ఆర్బీఐ గైడ్‌లైన్సులను తుంగలో తొక్కారని చెప్పారు. అటవీ భూమిని రేవంత్ రెడ్డి ప్రభుత్వం తాకట్టు పెట్టిందన్నారు. అటవీ భూమిని తాకట్టు పెట్టడం, అమ్మే అధికారం ప్రభుత్వానికి కూడా లేదన్నారు. వాల్టా, ఫారెస్టు చట్టాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఉల్లంఘించింది. బీజేపీ ఎంపీ సారధ్యంలోనే బ్రోకరేట్ కంపెనీ తీసుకొచ్చారు. ఆ ఎంపీకి రేవంత్ అనుచితి లబ్ధి చేకూరుస్తున్నారు. త్వరలోనే ఆ బీజేపీ ఎంపీ ఎవరో చెబుతానన్నారు. ఈ వ్యవహారంపై కేంద్ర దర్యాప్తు సంస్థలకు లేఖ రాస్తున్నట్లు వెల్లడించారు. కేంద్రం, ఆర్బీఐ, సీబీఐ, సెబీ, ఎస్ఎఫ్ఐవో దర్యాప్తు చేయాలని కోరుతున్నాం. 400 ఎకరాలకు టీ-జీఐఐసీకి యజమాని కాదు. తమది కాని భూమిని టీ-జీఐఐసీ తాకట్టు- పెట్టింది. మోసపూరిత భూమిని తాకట్టు పెట్టుకుని బ్యాంకు రుణం ఇచ్చింది. 400 ఎకరాల భూమి విలువ రూ.5,239 కోట్లు- అని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ చెబుతున్నది. అదే భూమి విలువ రూ.30 వేల కోట్లు- అని రెవెన్యూ శాఖ చెప్పింది. లేని భూమి ఉన్నట్లు చూపి లోన్ తీసుకోవాలని చూశారు. భయంకరమైన ఆర్థిక దోపిడీకి రేవంత్ రెడ్డి పాల్పడుతున్నారు. తమది కాని భూమిని టీ-జీఐఐసీ ఎలా తాకట్టు పెడ్తుందని కెటిఆర్ ప్రశ్నించారు. ప్రధానమంత్రి, కేంద్ర ఆర్థికమంత్రికి తెలియకుండా ఈ వ్యవహారం జరిగిందన్నారు. కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే సీవీసీ, సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కేంద్రం స్పందించకుంటే కాంగ్రెస్, బీజేపీ మధ్య ఒప్పందం ఉన్నట్లే అంటూ వ్యాఖ్యలు చేశారు. ఆర్బీఐ నిబంధనలు పాటించకుండా.. 10వేల కోట్లు తెచ్చారన్నారు. లిటిగేషన్ భూమికి ఐసీఐసీఐ బ్యాంకు ఎలా లోన్ ఇచ్చిందని ప్రశ్నించారు. ఫీల్డ్ విజిట్ చేయకుండానే బ్రోకర్ ఆధారంగా బ్యాంక్ ప్రభుత్వానికి రుణం ఇచ్చిందని కేటీఆర్ పేర్కొన్నారు.

# అంతరాష్ట్ర దొంగల ముఠ అరెస్ట్.




**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, ఏప్రిల్ 11:**

### పగలు వ్యాపారం, రాత్రి దారి దోపిడీలు. వివరాలు వెల్లడించిన కామారెడ్డి ఎస్పీ రాజేష్ చంద్ర.

పగలు వ్యాపారం చేస్తూ, రాత్రి జాతీయ రహదారిపై దారి దోపిడీలకు పాల్పడ్డ దొంగల ముఠాను అరెస్ట్ చేసినట్టు జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. పట్టణంలోని ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం వివరాలను వెల్లడించారు. ఈ ముఠాలో 11 మంది దొంగలు ఉన్నట్టు తెలిపారు. ఇందులో ఏడుగురిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించనున్నట్టు పేర్కొన్నారు. పరారీలో ఉన్న మరో ముగ్గురు నిందితులను పట్టుకునేందుకు టీమ్ లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. నిందితుల వద్ద నుండి 6 మొబైల్ ఫోన్లు, 2 ల్యాబ్ ట్యాబ్ లు, 4 కత్తులు, 2 రాళ్ళు, 2 టార్చ్ బ్యాటరీలు స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. నిందితులు గత ఐదు ఏళ్లుగా దొంగతనాలకు పాల్పడుతున్నట్టు వెల్లడించారు. మెదక్ జిల్లా కేంద్రంగా డేరాలు ఏర్పాటు చేసుకుని దారి దోపిడీలకు పాల్పడుతున్న పేర్కొన్నారు. పగలు సమయంలో చిరు వ్యాపారాలు చేస్తున్నట్టు నటిస్తూ రాత్రి సమయంలో జాతీయ రహదారిపై ఆగి ఉన్న వాహన దారులే లక్ష్యంగా చేసుకుని దారి దోపిడీలకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు.



**వేగుచుక్క న్యూస్: నిజామాబాద్ నూతన సీపీ గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సాయి చైతన్యని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ అరవింద్ ధర్మపురి. అనంతరం జిల్లాలో శాంతిభద్రతలు మరియు ఇతర అంశాల గురించి చర్చించారు. ఎంపీ తో పాటు అర్బన్ శాసనసభ్యులు ధన్పాల్ సూర్యనారాయణ, భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి పాల్గొన్నారు.**



### సెక్స్ వర్కర్లకు లేబర్ కార్డుల పంపిణీ.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, ఏప్రిల్ 11**

కోర్టు ఆవరణలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల ద్వారా 13 మంది మహిళా సెక్స్ వర్కర్లకు లేబర్ కార్డులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్ యోహాన్, స్నేహ సొసైటీ కార్యదర్శి ఎస్. సిద్దయ్య, అందుల ప్రత్యేక పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్. జ్యోతి, మానసిక దివ్యాంగుల పాఠశాల ప్రిన్సిపల్ రాజేశ్వరి, కోఆర్డినేటర్ డాక్టర్ కిరణ్మయి, ప్రాజెక్టు మేనేజర్ బాలరాజు, జిఎన్ఎమ్ మౌనిక, కౌన్సిలర్ అన్విత హెచ్ఆర్జీలు పాల్గొన్నారు.

## భగ్గుమన్న బంగారం ధరలు

**న్యూఢిల్లీ:** బంగారం ధర మళ్లీ భగ్గుమంది. అంతర్జాతీయంగా ఆర్థిక ఉద్రిక్తతలతో పసిడి ధర చుక్కలనంటుతోంది. అమెరికా, చైనాల మధ్య సుంకాల పోరు రోజురోజుకూ తీవ్రమవుతున్న నేపథ్యంలో పసిడికి పెట్టుబడులు మళ్లుతున్నాయి. దీంతో దేశ రాజధాని ఢిల్లీలో 10 గ్రాముల మేలిమి పసిడి ధర రూ.6250 పెరిగి శుక్రవారం రూ.96,450కు చేరింది. సాయంత్రం 6 గంటల సమయానికి హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో రూ.96,430 స్థాయి వద్ద ట్రేడయ్యింది. అంతర్జాతీయంగా ఔన్సు (31.10 గ్రాము) బంగారం ధర 3,223 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ఇంట్రాడేలో 3,237 డాలర్లకు చేరుకుంది. దీన్ని అనుసరించి దేశీయంగా 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు ) బంగారం ధర రూ.96 వేల మార్కు దాటింది. 99.5 స్వచ్ఛత కలిగిన బంగారం కూడా రూ.96 వేలు పలుకుతోంది. వెండి కిలో రూ.95,500 పలుకుతోంది. వాణిజ్య యుద్ధ భయాలతో ఏప్రిల్ 2న బంగారం ఔన్సు అంతర్జాతీయంగా 3200 డాలర్లను తాకింది. తర్వాత లాభాల స్వీకరణతో కాస్త తగ్గుముఖం పట్టింది. అయితే, ఇతర దేశాలపై విధించిన టారిఫ్‌లను తాత్కాలికంగా నిలుపుదల చేసిన ట్రంప్.. చైనాపై మాత్రం కొనసాగించారు.ఈ పరిణామాలు వాణిజ్య, ఆర్థిక అనిశ్చితులకు కారణమయ్యాయి. దీంతో మాంద్యం భయాలు నెలకొన్నాయి. డాలర్ ఇండెక్స్ నూరు డాలర్లకు దిగువకు చేరడం పసిడికి మరింత డిమాండ్ పెంచింది. సెంట్రల్ బ్యాంకులు కూడా పెద్ద మొత్తంలో బంగారం నిల్వలను పెంచుకుంటుండడంతో పుత్తడి ధరకు రెక్కలు రావడానికి కారణమని విశ్లేషిస్తున్నారు.



వేగుచుక్క

# సామజిక విప్లవ దార్శనికుడు

## 'మహాత్మా' జోతిరావు పూలే.



**వేగుచుక్క న్యూస్, సిరికొండ, ఏప్రిల్ 11:**

సమసమాజ నిర్మాణం కోసం అక్షరాలను ఆయుధంగా చేసుకొని, సమాజంలోని అణగారిన వర్గాల ప్రజలకు, మహిళలకు మానవ హక్కులను కల్పించడం కోసం జీవితమంతా పోరాడిన గొప్ప సామజిక విప్లవ దార్శనికుడు 'మహాత్మా' జోతిరావు పూలే అని సత్యశోధక్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ ఆర్. నర్సయ్య అన్నారు. సంఘ సంస్కర్త సామాజిక విప్లవోద్యమ పితా మహుడు రచయిత సబ్బండవర్ణాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే 198 వ జయంతిని సత్యశోధక్ పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మొదటగా ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య జ్యోతి రావు పూలే చిత్ర పటానికి పూలమాలనలంకరించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ, మానవతా విలువలైన స్వేచ్ఛ, సమానత్వం కోసం సమాజంలో పేరుకుపోయిన మూఢ విశ్వాసాలకు, అజ్ఞానానికి కారణమైన సామాజిక రుగ్మతలను కూకటివేళ్ళతో పెకిలించాలంటే విద్యయే సరైన మార్గమని, విద్య ద్వారానే సమాజాన్ని మార్చాలన్న ఆశయంతో అణగారినవర్గాల జీవితాల్లో అఖండ అక్షర జ్యోతులు వెలిగించి చైతన్యపరిచిన మానవతా మూర్తి పూలే అని అన్నారు. భారత దేశ చరిత్రలో సరికొత్త ఒరవడులతో పురుడు పోసుకొని, సమూలమైన పరిణామాల అంకురాలే లక్ష్యంగా స్థాపించబడిన సత్యశోధక్ సమాజ్ ఆశయాలు జ్యోతిరావు పూలే మరియు సావిత్రి బాయి పూలే ఆలోచనల సమాహారమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# సమాజానికి వెలుగుదారి "జ్యోతి రావు పూలే"

**ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కొండ నాగేశ్వర్, సోషియాలజీ ప్రొఫెసర్ రామ్ షపర్డ్.**

**ఓయూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల లో బ్లడ్ డొనేషన్ క్యాంప్.**



**వేగుచుక్క న్యూస్, హైదరాబాద్, ఏప్రిల్ 11:**

చీకటి సమాజానికి వెలుగుదారి "జ్యోతి రావు పూలే" అని ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కొండ నాగేశ్వర్, సోషియాలజీ ప్రొఫెసర్ రామ్ షపర్డ్ అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పిడిఎస్ యు (విజృంభణ), విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం బ్లడ్ డొనేషన్ క్యాంప్ నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కొండ. నాగేశ్వర్, ప్రొఫెసర్ రాములు, ప్రొఫెసర్ మాయాదేవి, ప్రొఫెసర్ బీనవేని రామ్ షపర్డ్, ప్రొఫెసర్ చలమల్ల వెంకటేశ్వర్లు హాజరై డొనేషన్ క్యాంపును ప్రారంభించి ప్రసంగించారు.

ఈ సందర్భంగా మహాత్మ జ్యోతిరావు పూలే ఆలోచనను విద్యార్థుల అనుసరించాలని, సమాజంలో జరుగుతున్న అసమానతలకు వ్యతిరేకంగా విద్యార్థులు ప్రశ్నించాలని, పోరాడాలని అన్నారు. చీకటి సమాజానికి వెలుగుదారి చూపిన సామాజిక విప్లవకారుడు పూలే అని అన్నారు. విద్యార్థులు మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాల బాటలో నడవాలని, ఆయన రాసిన గులాంగిరి పుస్తకాన్ని చదవాలని, విద్యార్థులను చైతన్యవంతం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆనాడు తాను చదువుకోవడమే కాకా తన భార్య సావిత్రిబాయి పూలేకి దళిత, బహుజన స్త్రీల చదువు కోసం, 1848 లో తన సహచరి సావిత్రి బాయ్ పూలే, మరియు తన స్నేహితుని చెల్లెలు ఫాతిమా షేక్ సహకారంతో, భారత్ దేశంలో మొట్టమొదటి పాఠశాలను స్థాపించాడని అన్నారు. బాల్య వివాహాలు రద్దు కోసం, వితంతు స్త్రీల పునర్ వివాహం కోసం కృషి చేశాడని, వారిని అన్ని విధాల ఆదుకోవడానికి, వారు మెరుగైన జీవితాన్నికి వితంతువలకు ఆశ్రమాన్ని స్థాపించాడని గుర్తు చేశారు. జ్యోతి రావ్ పూలే ఒక వైపు సామాజిక అణచివేతలపై పోరాటాన్ని కొనసాగిస్తూనే, గ్రామాల్లో ఆధిపత్య కుల వడ్డీవ్యాపారులు, పీడిత కుల ప్రజలపై కొనసాగిస్తున్న ఆర్థిక దోపిడికి వ్యతిరేకంగా పోరాటం చేశాడు అని అన్నారు.

**ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు, ఓయూ పరిశోధక విద్యార్థి ఆర్ఎల్. మూర్తి మాట్లాడుతూ..**

మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాల బాటలో విద్యార్థులు ఉద్యమించాలని అన్నారు. నేటి పాలకులు మహనీయుల ఆశయాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారని అన్నారు. విద్యారంగంలో శాస్త్రీయ భావాజాలానికి విరుద్ధంగా అశాస్త్రీయమైన భావాజాలన్నీ మూఢవిశ్వాసాలను పెంచి పోషించేలా విద్యా విద్యా విధానాన్ని అమలు చేస్తున్నారని అన్నారు. తరగతి నాలుగు గోడలలో మతాల పేరు మీద విద్యార్థులను విభజించే రాజకీయాలను తీసుకొచ్చారని అన్నారు. నూతన జాతీయ విద్యా విధానం మహనీయుల త్యాగాలతో వచ్చిన సామాజిక రిజర్వేషన్లు ఉల్లంఘిస్తుందని, అదేవిధంగా రాష్ట్రాల హక్కులను హరించేలా కేంద్రం పెత్తనం చలాయిస్తుందని అన్నారు. నూతన జాతీయ విద్యా విధానానికి వ్యతిరేకంగా మహనీయుల స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

**ఏఐఎస్ఎఫ్ ఓయూ సహాయ కార్యదర్శి ఉదయ్ కుమార్**

మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే నేటి విద్యార్థులకు ఆదర్శమని, మహాత్మ జ్యోతిరావు పూలే జీవితాన్ని ప్రతి ఒక్కరు చదవాలని అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి అంటే దండలు వేసి దండం పెట్టడమే కాదని ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయాల్సిన బాధ్యత కూడా విద్యార్థులపై ఉందని బ్లడ్ డొనేట్ చేయడం ద్వారా రక్తహీనతతో బాధపడుతున్నటువంటి వారికి, ఇతర అనారోగ్యానికి గురైన వారికి ఉపయోగపడుతుందని అన్నారు. బ్లడ్ డొనేషన్ క్యాంపుకి విద్యార్థులు, టీచర్స్ పెద్ద మొత్తంలో హాజరై బ్లడ్ డొనేట్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ యు విజృంభణ రాష్ట్ర కార్యదర్శి విజయ్, ఎస్ఎఫ్ఐ ఓయూ ఉపాధ్యక్షులు, అజయ్, క్రాంతి, పీఎస్ కుమార్, కరణ్, మహేష్, సతీష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# పూలే ఆశయాలను సాధిద్దాం.

## - అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ.



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, ఏప్రిల్ 11:**

మహాత్మా జ్యోతి రావ్ పూలె 199వ జయంతి సందర్భంగా భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో వినాయక నగర్ విగ్రహాల పార్క్ వద్ద శుక్రవారం జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ హాజరయ్యారు. మహాత్మా పూలె విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతు, మహాత్మా జ్యోతి రావ్ పూలె సామజిక తత్త్వవేతగా బడుగు బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయులని కొనియాడారు. మన దేశ ప్రగతి యాత్రలో వెనుకబడటానికి, వందల సంవత్సరాలు విదేశీయుల పాలనలో మ్రగ్గడానికి, మూఢచారాలు ప్రబలడానికి కారణం ప్రజల్లో జ్ఞానం లేకపోవడమే అని గుర్తించి సమాజంలో అందరిని విద్యావంతులను చేయాలనేవిషయంలో శ్రద్ధ వహించకపోవడమేనన్న విషయాన్నీ గ్రహించి జ్యోతిరావు పులే తన జీవితం అంత బడుగు బలహీన వర్గాల ప్రజలకు, స్త్రీలకు విద్య నేర్పించడానికి జీవితాన్ని అంకితం చేసారన్నారు. సత్యశోదక్ సమాజ్ ద్వారా సమాజంలో అసమానతలను, మూఢ నమ్మకాలను రూపుమాపడానికి పోరాటం చేశారన్నారు. జ్ఞానం లేకుంటే గౌరవం లభించదని, శిక్షణ లేకుంటే సమాజంలో సంస్కరణ సాధ్యం కాదని, స్త్రీలను విద్య అందించాలన్న సంకల్పంతో మొదట తన భార్య సావిత్రిభాయ్ విద్య నేర్పిచి పూణే నగరంలో మొదటిసారిగా బాలికల కోసం ఒక పాఠశాలను ప్రారంభించారని తెలియజేసారు. నేటి సమాజం, యువత వారి ఆశయ సాధనలో నడవలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు.

ఈ కార్యక్రమంలో బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా నాయకులు, కార్పొరేటర్లు, మండల అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల పక్షాన పోరాడే సంఘం "టీడబ్ల్యూజేఎఫ్".



**పాలకుల పక్షం కాదు.. మేం పాత్రికేయుల పక్షం.**

**ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బసవపునయ్య.**

**రంగారెడ్డి జిల్లాలో భారీగా సభ్యత్వ నమోదు.**

**ఫెడరేషన్ లో చేరిన వివిధ యూనియన్ల నేతలు.**

**వేగుచుక్క న్యూస్,రంగారెడ్డి, ఏప్రిల్ 11:**

రాష్ట్రంలో జర్నలిస్టుల పక్షాన పోరాడే ఏకైక సంఘం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) అని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అన్నారు. జర్నలిస్టులకు అండగా ఉండేందుకు ప్రత్యామ్నాయ ట్రేడ్ యూనియన్ గా ఏర్పడిన ఫెడరేషన్ జర్నలిస్టుల ఆదరణతో నెంబర్ వన్ యూనియన్ గా బలపడిందని అన్నారు. రాష్ట్రవ్యాపితంగా జరుగుతున్న ఫెడరేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి జర్నలిస్టుల నుంచి విశేష స్పందన లభిస్తుందని అన్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని తుక్కుగూడలో జరిగిన టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా సభ్యత్వ నమోదు కార్యక్రమం, వివిధ యూనియన్ల నేతల చేరికల కార్యక్రమంలో వారు మాట్లాడుతూ, రాష్ట్రంలో జర్నలిస్టుల పరిస్థితులు మరింత దారుణంగా మారుతున్నాయని, ఒకవైపు యాజమాన్యాలు, ప్రభుత్వాలు పట్టించుకోక పోవడం లేదని, మరోవైపు దాడులు, అవమానాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టులు శిక్షణతో కూడిన వృత్తినైపుణ్యతను పెంపొందించుకొని విధినిర్వహణలో సమర్థవంతంగా ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్రంలోని కొన్ని ప్రధాన జర్నలిస్టు యూనియన్లు జర్నలిస్టుల పక్షం కాకుండా పాలకుల పక్షాన నిలిచి జర్నలిస్టుల సమస్యలను విస్మరించాయని విమర్శించారు. టీడబ్ల్యూజేఎఫ్ సంఘం పాలకుల పక్షాన కాకుండా కేవలం పాత్రికేయుల పక్షాన నిలిచి సమస్యలపై పోరాడుతుందని మామిడి సోమయ్య స్పష్టం చేశారు. ఈ సంఘంలో ఉన్న పాత్రికేయులు కూడా ప్రజల పక్షం ఉండాలని, ప్రజల సమస్యలపై స్పందించాలని కోరారు. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వాలు జర్నలిస్టులను పూర్తిగా విస్మరించాయని, గత బీఆర్ ఎస్ ప్రభుత్వం జర్నలిస్టులకు తీరని అన్యాయం చేసిందని అన్నారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు రాకపోవడానికి గత ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. హెల్త్ కార్డులు, అక్రెడిటేషన్ కార్డులు, జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజు తగ్గింపు, ఇండ్ల స్థలాలు వంటి సమస్యలు పరిష్కరించాల్సి వుందని అన్నారు. హక్కుల సాధన కోసం రాబోయే రోజుల్లో ఫెడరేషన్ నిర్వహించబోయే ఉద్యమాల్లో జర్నలిస్టులు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐఎఫ్ డబ్ల్యూజే కార్యదర్శి పులిపలుపుల ఆనందం, నేషనల్ కౌన్సిల్ సభ్యుడు దేవేందర్, ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్, కార్యదర్శి జగదీష్, జిల్లా కార్యదర్శి సైదులు తదితరులు పాల్గొన్నారు.

**టీడబ్ల్యూజేఎఫ్ లో చేరిన 200 మంది జర్నలిస్టులు**

రంగారెడ్డి జిల్లాకు చెందిన తెలంగాణ రాష్ట్ర యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(టీఎస్ యూడబ్ల్యూజే-ఐజేయూ అనుబంధం), తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(టీయూడబ్ల్యూజే-143) యూనియన్ లకు చెందిన దాదాపు రెండు వందల మంది జర్నలిస్టులు టీడబ్ల్యూజేఎఫ్ లో చేరారు. సూర్య దినపత్రిక జిల్లా బ్యూరో రిపోర్టర్ గణేష్, వార్త జిల్లా బ్యూరో రఘుపతి, సాక్షి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ శ్రీశైలం, దిశ జిల్లా బ్యూరో సురేష్ తదితరులతో పాటు వివిధ పత్రికలకు చెందిన రెండు వందల మంది జర్నలిస్టులు ఆయా జర్నలిస్టు యూనియన్లకు రాజీనామా చేసి ఫెడరేషన్ లో చేరారు. వీరందరికి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడి సోమయ్య, బి.బసవపున్నయ్య సభ్యత్వం ఇచ్చి సంఘంలోకి ఆహ్వానించారు.

# జ్యోతిబా పూలే స్ఫూర్తితో పోరాడాలి: పిడిఎస్ యు.




**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, ఏప్రిల్ 11:**

దేశంలో కుల వ్యవస్థకు వ్యతిరేకంగా జ్యోతిబా పూలే పోరాటస్ఫూర్తితో పోరాడాలని పిడిఎస్ యూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్. గౌతం కుమార్, జన్నారపు రాజేశ్వర్ లు పిలుపునిచ్చారు. నగరంలోని నీలం రామచంద్రయ్య భవన్లో శుక్రవారం పిడిఎస్ యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జ్యోతిబాపూలే జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, దేశంలో మొట్టమొదటిసారిగా స్త్రీ విద్యను ప్రోత్సహించి తన భార్య అయిన సావిత్రి బాయి పూలే కి విద్య నేర్పించి సమాజంలో ఆదర్శప్రాయుడిగా నిలిచాడని, నిచ్చెనమెట్ల వ్యవస్థగా ఉన్న కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం నిర్వహించారని అన్నారు. బడుగు బలహీన వర్గాలకు ప్రశ్నించడం నేర్పించారనీ, ఆయన స్ఫూర్తితో ఈ దేశంలో కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కార్తీక్, సహాయ కార్యదర్శులు ప్రిన్స్, దేవిక, జిల్లా కమిటీ సభ్యులు మనోజ్, నిఖిల్ , రవీందర్, సాయినాథ్, నగర నాయకులు సాయికిరణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.



వేగుచుక్క న్యూస్: గావ్ చలో - బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నిజామాబాద్ నగర శివారు లోని మాధవ్ నగర్ లో ప్రజలతో ఎంపీ అరవింద్ మమేకమయ్యారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులచారి, స్థానిక తాజా మాజీ కార్పొరేటర్ ప్రమోద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా మహాత్మా జ్యోతిబా పూలే జయంతి.

**సాంఘిక బహిష్కరణలు విధించే వీడీసీలపై కఠిన చర్యలు: కలెక్టర్ స్పష్టీకరణ.**



**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, ఏప్రిల్ 11**


: మహాత్మా జ్యోతిబా పూలే 199వ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో న్యూ అంబేద్కర్ భవన్ లో ఏర్పాటు చేసిన ఉత్సవాలకు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ముఖ్య అతిథిగా విచ్చేయగా, రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్ ఈరవత్రి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ, సామాజిక రుగ్మతలను, దురాచారాలను పారద్రోలేందుకు అవిశ్రాంతంగా కృషి చేసిన మహనీయుడు జ్యోతిబా పూలే అని కొనియాడారు. అనేక ఆంక్షలతో కూడిన నాటి సమాజంలో అణగారిన వర్గాలకు తగిన గౌరవం దక్కాలంటే విద్యతోనే సాధ్యం అని గుర్తించిన పూలే, విద్యను నేర్చుకోవాల్సిన ఆవశ్యకత గురించి నొక్కి చెప్పారన్నారు. ప్రత్యేకించి బాలికల విద్య కోసం పాఠశాలలు నెలకొల్పి ప్రత్యేక కృషి కొనసాగించారని గుర్తు చేశారు. అన్ని వర్గాలకు సమానత్వం ఉండాలన్నదే పూలే అభిమతం అని, ఆ దిశగా తుది వరకు తన కృషిని కొనసాగించారని కొనియాడారు. ఆయన చూపిన బాటలో పయనిస్తూ, పూలే ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా విద్యార్థులు మహనీయుల జీవిత చరిత్ర గురించి, వారు సమాజ అసమానతలకు వ్యతిరేకంగా జరిపిన పోరాటాల గురించి తెలుసుకోవాలని సూచించారు.

**సాంఘిక బహిష్కరణలు విధిస్తే కఠిన చర్యలు**

కాగా, జిల్లాలోని పలు ప్రాంతాల్లో గ్రామాభివృద్ధి కమిటీల పేరిట సాంఘిక బహిష్కరణలు విధిస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని, అలాంటి వీ.డీ.సీలపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పూలే జయంతి వేదిక ద్వారా స్పష్టం చేశారు. గ్రామాల అభివృద్ధికి వీ.డీ.సీలు కృషి కొనసాగిస్తే ఎవరికీ ఎలాంటి అభ్యంతరం ఉండదని, అందుకు భిన్నంగా వీడీసీ ముసుగులో చట్టాన్ని ఉల్లంఘించే చర్యలకు పూనుకుంటే ఎంతమాత్రం ఉపేక్షించబోమని తేల్చి చెప్పారు. సాంఘిక బహిష్కరణ ఫిర్యాదులపై పోలీస్ కమిషనర్ తో ఒకటి రెండు రోజుల్లోనే చర్చించి చట్ట ప్రకారం చర్యలు చేపట్టేలా చూస్తామని అన్నారు. సాంఘిక బహిష్కరణలు వంటి రుగ్మతలకు వ్యతిరేకంగా వివిధ సంఘాలు కూడా కృషి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. సమాజంలో ఇంకనూ అక్కడక్కడ నెలకొని ఉన్న వివక్షతను రూపుమాపేందుకు పూలే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్ ఈరవత్రి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ లు మాట్లాడుతూ, పూలే కృషిని కొనియాడారు. దాదాపు 200 సంవత్సరాల క్రితం అనేక ఆంక్షలతో కూడిన నాటి సమాజంలో నెలకొని ఉన్న రుగ్మతలను పారద్రోలేందుకు జ్యోతిబాపూలే చేసిన కృషి అనన్య సామాన్యమైనదని అన్నారు. అనేక అవరోధాలు, అవమానాలు ఎదురైనప్పటికీ ఏమాత్రం వెరువకుండా పూలే నాటి సాంఘిక దురాచారాలను తుదముట్టించేందుకు ఎంతగానో శ్రమించారని గుర్తు చేశారు.

కాగా, ఈ కార్యక్రమానికి ముందు వినాయక్ నగర్ హనుమాన్ జంక్షన్ వద్ద గల మహాత్మా పూలే విగ్రహానికి అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, బీసీ సంఘాల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారిణి స్రవంతి, సహాయ అధికారి నర్సయ్య, వివిధ సంఘాల ప్రతినిధులు గైని గంగారాం, బుస్స ఆంజనేయులు, నరాల సుధాకర్, మాడవేడి వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# తమన్నా మరో ప్రత్యేక గీతం

క్రేజీ ఐటమ్ సాంగ్స్‌కి తమన్నా కేరాఫ్ అడ్రస్‌గా మారడం తెలిసిందే. ముఖ్యంగా "జైలర్, స్త్రీ-2" చిత్రాలలో భాటియా చేసిన సాంగ్స్ సదరు చిత్రాలు సాధించిన సంచలన విజయాలలో కీలక పాత్ర పోషించడంతో ఆమె స్పెషల్ సాంగ్స్‌కు క్రేజ్ ఏర్పడింది. ఈ నేపథ్యంలో అజయ్ దేవగన్ "రైడ్-2" చిత్రంలో తమన్నాతో ఓ ప్రత్యేక గీతం చిత్రీకరిస్తున్నారు. మే 1న ఈ చిత్రం విడుదల కానుంది!!



# ప్రతినాయకుల ప్రణయగీతం


హీరో హీరోయిన్లే కాదు... విలన్లు కూడా ప్రేమ పాటలు పాడుకుంటే ఎలా ఉంటుంది? ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచే వినూత్నమైన ఈ ప్రయత్నం మా సినిమాలో చూడొచ్చని చెబుతున్నారు బాబ్జీ. ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పోలీస్ వారి హెచ్చరిక'. సన్నీ అఖిల్, అజయ్ ఘోష్, రవి కాలే, గిద్దేశ్ ప్రధాన పాత్రధారులుగా నటించారు. బెల్లి జనార్ధన్ నిర్మాత. ఈ చిత్రంలోని ప్రేమ గీతాన్ని ప్రముఖ నటుడు రాజేంద్రప్రసాద్ బుధవారం విడుదల చేశారు. ఇది ప్రతినాయకుల పాడుకునే ప్రేమగీతం కావడం విశేషం. నటుడు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ "విలన్లు పాడుకునే డ్యూయెట్ ఓ కొత్త కాన్సెప్ట్. ఈ సినిమా తర్వాత ఇదొక ట్రెండ్ అవుతుందని నా నమ్మకం" అన్నారు.



# విధ్వంసకర నేలపైకి...

వచ్చే ఏడాది అత్యంత ప్రతిష్ఠాత్మకమైన చిత్రాలు తెలుగు ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. అందులో ఒకటి ఎన్టీఆర్ - ప్రశాంత్ నీల్ కలయికలో రూపొందుతున్న చిత్రం. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ నిర్మిస్తోన్న ఈ సినిమా గురించి ఓ కీలకమైన విషయాన్ని పంచుకుంది చిత్రబృందం. విధ్వంసకర నేలపైకి అడుగు పెడుతున్నారంటూ ఈ నెల 22 నుంచి ఎన్టీఆర్ ఈ సినిమా సెట్లోకి రానున్న సంగతిని బయట పెట్టింది. వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా చిత్రీకరణ చాలా రోజుల కిందటే ప్రారంభమైంది. ఎన్టీఆర్ లేకుండా, ఇతర తారాగణంపై ప్రశాంత్ నీల్ కొన్ని సన్నివేశాల్ని చిత్రీకరించారు. ఇక ఎన్టీఆర్ అడుగు పెట్టారంటే చిత్రీకరణ మరింతగా ఊపందుకుంటుంది. ఈ సినిమా కోసం ఎన్టీఆర్ ప్రత్యేకంగా సన్నద్ధమయ్యారు. బరువు తగ్గి బాగా నాజూగ్గా కనిపిస్తున్నారు. 'దేవర' తర్వాత ఎన్టీఆర్... 'సలార్' తర్వాత ప్రశాంత్ నీల్ కలిసి చేస్తున్న చిత్రమిది.

లిటిల్ వారియర్... ధైర్యంగా ఉండు: సింగపూర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో మార్క్ శంకర్ గాయపడటంపై విచారం వ్యక్తం చేశారు అగ్ర కథానాయకుడు ఎన్టీఆర్. ఈ సంఘటన గురించి తెలిసి ఎంతో బాధపడ్డానని, తను





త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నట్టుగా ఎక్స్ ద్వారా ఓ పోస్ట్‌ని పంచుకున్నారు. లిటిల్ వారియర్, ధైర్యంగా ఉండు... అంటూ మార్క్‌ని ఉద్దేశించి వ్యాఖ్య చేశారు ఎన్టీఆర్. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, ప్రముఖ కథానాయకుడు పవన్‌కల్యాణ్ చిన్న కుమారుడైన మార్క్ శంకర్ సమ్మర్ క్యాంప్‌లో భాగంగా సింగపూర్‌లోని ఓ పాఠశాలలో చేరగా, అందులో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మంగళవారం పవన్‌కల్యాణ్‌తోపాటు, చిరంజీవి దంపతులు సింగపూర్ బయల్దేరి వెళ్లారు.



# 'ఆ క్షణంలో అమ్మ ఆనందం మాటల్లో వర్ణించలేనిది': కల్యాణ్‌రామ్

"ప్రాణాన్ని పణంగా పెట్టి జన్మనివ్వడంతోపాటు... ఏమీ ఆశించకుండా జీవితాంతం మన కోసమే పరితపిస్తుంది అమ్మ. అలాంటి స్త్రీమూర్తి కోసం ఎంత త్యాగం చేసినా తక్కువే. వాళ్లని గౌరవించుకోవడం, కాపాడుకోవడం మనందరి బాధ్యత. అదే మా సినిమా" అన్నారు కల్యాణ్‌రామ్. ఆయన కథానాయకుడిగా తెరకెక్కిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. విజయశాంతి ముఖ్య పాత్రని పోషించారు. సయీ మంజ్రేకర్ నాయిక. ఎన్టీఆర్ ఆర్ట్స్‌తో కలిసి అశోక క్రియేషన్స్ పతాకంపై అశోక్‌వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించారు. ప్రదీప్ చిలుకూరి దర్శకుడు. ఈ చిత్రం ఈ నెల 18న ప్రేక్షకుల ముందుకొస్తోంది. 'ముచ్చటగా బంధాలే...' అంటూ సాగే ఈ చిత్రంలోని పాటని బుధవారం రాత్రి చిత్తూరులో విడుదల చేశారు. అజనీశ్ లోక్‌నాథ్ స్వరపరిచిన ఈ పాటని రఘురామ్ రచించారు. హరిచరణ్ ఆలపించారు. వేడుకని ఉద్దేశించి కల్యాణ్‌రామ్ మాట్లాడుతూ "పండగ వచ్చినా, సెలవు వచ్చినా మనం ఆలస్యంగా లేస్తాం కానీ, మనం లేచేసరికి అన్నీ సిద్ధం చేస్తుంటారు అమ్మ. బిడ్డల భవిష్యత్తు కోసం నిరంతరం పనిచేసే అమ్మలకు రుణపడి ఉండాలి. పొరపాటున కూడా వాళ్లపై చికాకు పడకూడదు" అన్నారు. ఈ నెల 12న విడుదలకు ముందస్తు వేడుకని నిర్వహిస్తున్నామని, ఆ వేడుకకి తమ్ముడు ఎన్టీఆర్ హాజరవుతున్నారని చెప్పారు. వేడుకకి హాజరైన విద్యార్థులని ఉద్దేశించి మాట్లాడుతూ కళాశాల జీవితం అత్యుత్తమమైనదని, ప్రతి క్షణాన్ని ఆస్వాదించాన్నారు. అదే సమయంలో బాధ్యతగా ఉండాలని కోరారు. విజయశాంతి మాట్లాడుతూ "విలువలు తెలిసిన మనిషి కల్యాణ్‌రామ్. ఎన్టీఆర్ మనవడు కదా ఆ క్రమశిక్షణ ఎక్కడికిపోతుంది? ఇందులో అద్భుతంగా నటించాడు" అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, మురళీ మోహన్‌తో పాటు రావూరి వెంకటస్వామి, రావూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కన్నప్పకు కంగ్రాట్స్ చెప్పిన యోగి ఆదిత్యనాథ్



కన్నప్ప టీం యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. మోహన్ బాబు, విష్ణు, ప్రభుదేవా వంటి వారు యూపీ సీఎంను కలిశారు. కన్నప్ప టీంను యూపీ సీఎం సాదర స్వాగతాలతో ఆహ్వానించారు. యూపీ సీఎం ఆతిథ్యానికి కన్నప్ప టీం ఫిదా అయింది. ప్రముఖ చిత్రకారుడు రమేష్ గొరిజాల గీసిన చిత్రపటాన్ని యూపీ సీఎంకు మోహన్ బాబు బహూకరించారు. అనంతరం కన్నప్ప రిలీజ్ డేట్ పోస్టర్‌ను యూపీ సీఎం ఆదిత్య నాథ్ రిలీజ్ చేసి అభినందించారు.

జూన్ 27న కన్నప్ప చిత్రాన్ని విడుదల చేయబోతున్నారు. అవా ఎంటర్టైన్మెంట్స్, 24 ఫ్రేమ్ ఫ్యాక్టరీ బ్యానర్లపై మోహన్ బాబు కన్నప్ప సినిమా నిర్మించారు. ముఖేష్ కుమార్ సింగ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో మోహన్ బాబు, మోహన్ లాల్, అక్షయ్ కుమార్, ప్రభాస్ వంటి భారీ తారాగణం నటించిన సంగతి తెలిసిందే!!



# అందుకే జయలలితకు వ్యతిరేకంగా మాట్లాడా

దివంగత ముఖ్యమంత్రి జయలలిత కారణంగా ఒక రోజు రాత్రి తనకు నిద్ర పట్టలేదని ప్రముఖ తమిళ నటుడు రజనీకాంత్ అన్నారు. దివంగత మాజీ మంత్రి, సత్య మూవీస్ వ్యవస్థాపకుడు, నిర్మాత ఆర్.ఎం.వీరప్పన్ తొలి వర్ధంతి సందర్భంగా సత్య మూవీస్ ఓ డాక్యుమెంటరీని విడుదల చేసింది. అందులో ఆర్.ఎం.వీరప్పన్‌తో తమ స్మృతులను ముఖ్యమంత్రి స్టాలిన్, రజనీకాంత్ పంచుకున్నారు. రజనీకాంత్ మాట్లాడుతూ... తనపై అభిమానం చూపిన అతికొద్ది మందిలో ఆర్.ఎం.వీరప్పన్ ఒకరన్నారు. 'బాషా' వందరోజుల వేడుకల్లో బాంబు సంస్కృతి గురించి మాట్లాడానని తెలిపారు. ఆ వేదికపై చిత్ర నిర్మాత, నాటి మంత్రి ఆర్.ఎం.వీరప్పన్ కూడా ఉన్నారని పేర్కొన్నారు. ఓ మంత్రి ఉండగా అలా మాట్లాడకూడదనే స్పష్టత అప్పట్లో తనకు లేదన్నారు. వేదికపై ఉండీ తన వ్యాఖ్యలను అడ్డుకోలేదనే ఆగ్రహంతో ఆయన్ను నాటి ముఖ్యమంత్రి జయలలిత మంత్రి పదవి నుంచి తొలగించారని, తన వల్లే ఇలా జరిగిందని ఆ రాత్రంతా తనకు నిద్రపట్టలేదని తెలిపారు. మరుసటి రోజు ఆయనకు ఫోన్ చేసి క్షమాపణ కోరగా 'ఇదేముందిలే' అంటూ చాలా సింపుల్‌గా తీసుకుని మాట్లాడారని పేర్కొన్నారు. ఈ విషయం గురించి నేరుగా జయలలితతో మాట్లాడతానని చెప్పగా దానికి ఆయన సున్నితంగా తిరస్కరించారని తెలిపారు. ఆమె నిర్ణయం తీసుకుంటే ఎవరి మాటా వినరని, ఆమెతో మాట్లాడి మీ గౌరవాన్ని పోగొట్టుకోవడం నాకు ఇష్టంలేదని చెప్పారని పేర్కొన్నారు. జయలలితకు వ్యతిరేకంగా అప్పట్లో తాను గళం విప్పడానికి పలు కారణాలు ఉన్నా అందులో ఇది ప్రధానమైందని తెలిపారు.